జిల్లా అభివృద్ధికి 'వుడా' ఏర్పాటు

పరిగి, న్యూస్‌టుడే: జిల్లాను అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వుడా)ని ఏర్పాటు చేసినట్లు డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి తమ నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ మేరకు జీవో విడుదల చేశారని, వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలోకి జిల్లాలోని మున్సిపాలిటీలతో పాటు 493 గ్రామాలు, కడా కూడా వస్తుందని తెలిపారు.

రూ.3,600 కోట్లతో రైల్వే లైన్ సర్వే పనులు పూర్తి

రూ.3600 కోట్లతో రైల్వే లైన్ సర్వే పనులు పూర్తయ్యాయని వంతెన నిర్మాణానికి క్షేత్రస్థాయిలో కసరత్తులు జరుగుతున్నాయన్నారు. పరిగి మున్సిపాలిటీలో రూ.25 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. లఖ్నాపూర్‌లో ప్రాజెక్టును హుస్సేన్‌సాగర్ మాదిరిగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సిద్ధాంతి పార్థసారథి, పి.చంద్రయ్య, కె.హనుమంతు, పరశురాంరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.చంద్రయ్య జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.


మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

బొంరాస్‌పేటలో టూరిజం హోటల్

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గానికి ప్రభుత్వం మరో ప్రాజెక్టును మంజూరు చేసింది. బొంరాస్‌పేట మండలంలో టూరిజం హోటల్ నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి సమీపంలోని శ్రీ పరమేశ్వర దేవాలయం సమీపంలోగానీ లేదా బొంరాస్‌పేట పెద్ద చెరువు సమీపంలో గానీ రెండు ఎకరాల విస్తీర్ణంలో టూరిజం హోటల్ నిర్మించనున్నారు. దీనికోసం రూ.20 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేయగా మొదటి విడతలో ప్రభుత్వం రూ.10 కోట్లను మంజూరు చేసింది. దీంతో ఈ ప్రాంతం పర్యటకంగా అభివృద్ధిచెందుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఈఎస్‌ఐ ఆసుపత్రిగా మున్సిపల్ పాత భవనం

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: తాండూరు పురపాలక సంఘం కార్యాలయం పాత భవనం త్వరలో ఈఎస్‌ఐ ఆస్పత్రిగా మారబోతోంది. మున్సిపాలిటీకి కొత్త భవనం నిర్మాణం అయిన తర్వాత మూణ్నేళ్ల కిందట ఇందులోని కార్యాలయాన్ని కొత్త భవనంలోకి తరలించారు. నాటి నుంచి పాత భవనం నిరుపయోగంగానే ఉంది. రకరకాల కార్యకలాపాలు జరుగుతూ వస్తున్నాయి. విషయాన్ని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని స్థానికులు తీసుకెళ్లారు. ఇటీవలే స్థానికంగా జరిగిన ఓ సమావేశంలో పాల్గొన్న ఆయన ఈఎస్‌ఐ ఏర్పాటు గురించి మాట్లాడారు.

24 వేలకు పైగా కార్మికులు

జిల్లాకు ఆర్థిక రాజధానిగా పేరున్న తాండూరులో వేలాది ఎకరాల్లో సిమెంటు, నాపరాతి, సుద్ద గనులున్నాయి. వీటిని వెలికి తీసేందుకు ఇక్కడ దాల్మియా, సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, పెన్నా, చెట్టినాడ్ తదితర సిమెంటు కర్మాగారాలున్నాయి. నాపరాళ్లను వెలికితీసి అందంగా తీర్చిదిద్ది దేశ, విదేశాలకు ఎగుమతి చేయడంలో దాదాపు 24,000కు పైగా కార్మికుల చెమటోడుస్తున్నారు. నిత్యం గనుల్లో యంత్రాల మధ్య పని చేస్తూ తరచూ గాయాల పాలవుతున్నారు. తీవ్రమైన దెబ్బలు తగిలితే వీరికి స్థానికంగా ఈఎస్‌ఐ లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. ఇక్కడే జిల్లా ఆసుపత్రి ఉన్నా నిత్యం జిల్లా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి దాదాపు 500 మందికి పైగా రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. కార్మికులకు ప్రత్యేకంగా ఆసుపత్రి లేకపోవడంతో సకాలంలో వైద్యం అందక కొందరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు కూడా గతంలో చోటుచేసుకున్నాయి. ఇలాంటి ప్రమాదాలు అరికట్టడానికి స్థానికంగా ఈఎస్‌ఐ ఏర్పాటుచేయాలని కార్మికులు, స్థానికులు ఏళ్లుగా కోరుతున్నారు.

ఆరోగ్య పరీక్షలకు అనుకూలమని..

సిమెంటు పరిశ్రమలతోపాటు ఇతర ప్రయివేటు వ్యాపార కేంద్రాలలో పని చేస్తున్న కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించటానికి పురపాలక కార్యాలయం పాత భవనం అనువుగా ఉంటుందని ఎమ్మెల్యేతోపాటు స్థానిక నేతలు అభిప్రాయ పడుతున్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే పాత మున్సిపల్ భవనంలో ఈఎస్‌ఐ ఆస్పత్రిని ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. తద్వారా ఇక్కడి ప్రాంత కార్మికులకు ఆరోగ్య పరమైన వేద్య సేవలు అందుతాయి. కార్యాలయంలో ఆస్పత్రికి వచ్చే వారి కోసం తాగు నీరు, శౌచాలయాలు, పరీక్ష గదులు, వైద్యుల గదులు వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. అన్ని పనులు పూర్తి అయిన వెంటనే అక్కడ ఈఎస్‌ఐ ఆస్పత్రి అందుబాటులోకి వస్తుంది.

ఉపాధి పనులకు అవినీతి మకిలీ

సామాజిక తనిఖీలో వెల్లడి • ఇప్పటి వరకు రావాల్సింది రూ.50.18లక్షలు

న్యూస్‌టుడే, బషీరాబాద్, ధారూరు, మర్పల్లి

పేదలకు నివారించడంతో పాటు గ్రామీణ పేదలకు స్థానికంగా ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారు. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారు. ఇదే సమయంలో అధికారులు చేసిన పనులకు పారదర్శకత ఉండాలనే ఉద్దేశంతో సామాజిక తనిఖీ నిర్వహించి అవినీతిని బయటకు తీస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన సామాజిక తనిఖీలో వెల్లడైన వివరాలతో 'న్యూస్‌టుడే' కథనం..


మర్పల్లిలో సామాజిక తనిఖీ బృందం నిర్వహణ

జిల్లాలో ఏడు మండలాలు..

జిల్లాలో 20 మండలాలు ఉండగా.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి దౌల్తాబాద్, బొంరాస్‌పేట, మర్పల్లి, కోట్‌పల్లి, కుల్కచర్ల, మోమిన్‌పేట, ధారూరు మండలాల్లో ఇప్పటి వరకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా చేసిన పనులను చేపట్టారు. వాటిలో ఉపాధి సిబ్బంది ఇచ్చిన వివరాల ప్రకారం. . ఆయా గ్రామాలకు తనిఖీ బృందం సభ్యులు క్షేత్ర పర్యటన చేశారు. చేసిన పనికి ఆధారాలను సేకరించారు. లేకపోతే జరిమానా లేదా రికవరీకి ఉన్నతాధికారులకు సిఫారసు చేశారు. ఇలా జిల్లా వ్యాప్తంగా ఏడు మండలాలకు కలిపి పనులకు రూ.43.20 మేర అవినీతి జరిగింది. దీనికి జరిమానా కింద రూ.6.97లక్షలు మొత్తం కలిపి రూ.50.80లక్షలు వసూలు కావాలని బృందం సభ్యులు తేల్చారు.

• బొంరాస్‌పేట మండలంలోని వివిధ పనులు జరగకున్నా జరిగినట్లు రికార్డుల్లో రాయడం, ఆధారాలు సరైనవిగా సమర్పించలేదు. దీంతో ప్రజావేదికలో రూ.16,98,520 రావాల్సి ఉందని నివేదించారు.

ఆధారాలు సమర్పిస్తే మినహాయింపు

సామాజిక తనిఖీ బృందం సభ్యులు విధించిన జరిమానా, పెనాల్టీలను మినహాయించుకునే అవకాశాన్ని అధికారులు కల్పిస్తున్నారు. ఉదాహరణకు పనులు చేసిన తరువాత వర్షాలకు తుడుచుకుపోయే అవకాశం ఉంటుంది.. బృందం తనిఖీలో పనులు చేయలేదని, జరిమానా నిర్ధరిస్తారు. అయితే అప్పట్లో పనులు చేసిన చిత్రాలు, ఇతర ఆధారాలు సమర్పిస్తే జరిమానా, పెనాల్టీ విధింపు నుంచి మినహాయింపు చేస్తామని, ఇందుకు గడువు ఇస్తామని ఉపాధి హామీ పథకం అధికారులు వివరిస్తున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

మండలం	రావాల్సింది (రూ.)	జరిమానా(రూ.)
దౌల్తాబాద్	80,754	36,000
బొంరాస్‌పేట	16,34,520	64,000
మర్పల్లి	2,52,655	1,19,500
కోట్‌పల్లి	12,59,765	1,90,000
కుల్కచర్ల	3,08,436	80,000
మోమిన్‌పేట	4,36,318	77,000
ధారూరు	3,48,085	1,31,000

పథకం పారదర్శక అమలుకు దోహదం

ఉపాధి పనులు చేసిన వాటిపై ప్రతి ఏడాది సామాజిక తనిఖీ నిర్వహిస్తారు. పథకం పారదర్శకంగా ఉండేందుకు తనిఖీ దోహద పడుతుంది. వివరాల వారీగా జిల్లాలోని అన్ని మండలాల్లో తనిఖీలు ఉంటాయి. – శ్రీనివాస్, డీఆర్‌డీఏ, వికారాబాద్.

ప్రకృతి వ్యవసాయానికి తోడ్పడతాం


సేంద్రియ వరి పైరును పరిశీలిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, అధికారులు

ధారూర్: ప్రకృతి వ్యవసాయానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగసమందర్ గ్రామ శివారులో సౌభాగ్య గోసదన్ సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ఉద్యమకారుడు విజయ్‌రామ్ తన క్షేత్రంలో పండిస్తున్న ప్రకృతిసాగు పైర్ల గురించి వివరించారు. తాండూరులో తన క్షేత్రంలో కూడా ప్రకృతి వ్యవసాయం చేయడానికి కృషి చేస్తామన్నారు. భాజపా జిల్లా అధ్యక్షులు మాధవరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, వివిధ గ్రామాల రైతులు తదితరులు ఉన్నారు.

సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం 25 న



వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: వికారాబాద్ శివరాంనగర్ కాలనీలో వెలసిన శ్రీ సంతోషిమాతా దేవి ఆలయ 31వ వార్షికోత్సవం ఈనెల 25 శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పండరినాథ్, సరోజ తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, 9 గంటల నుంచి భగవద్గీత, హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మహా మంగళహారతి, అనంతరం రఘునాథ్ పంతులు, గొల్లపల్లి అంజిరెడ్డిచే ధార్మిక ప్రసంగం ఉంటుందన్నారు.

పెట్టుబడి సాయం అందించే వరకు ఆందోళన: భారాస


పరిగిలో నినదిసున్న మహేష్‌రెడ్డి, నేతలు


తుంకిమెట్లలో ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

పరిగి, న్యూస్‌టుడే: రైతు భరోసా, రుణమాఫీ, రైతు బీమా, బోనస్ రూ.500 చెల్లించే వరకు భారాస రైతుల పక్షాన ఆందోళన చేపడుతుందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బీజాపూర్ -హైదరాబాద్ జాతీయ రహదారిపై చేపట్టిన నిరసనలో పాల్గొని మాట్లాడారు. పుర ఛైర్మన్ అశోక్‌కుమార్, మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, ఆర్.ఆంజనేయులు, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల సొసైటీ ఛైర్మన్ కె.శ్యాంసుందర్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట: రైతులకు వానాకాలం పెట్టుబడి సహాయం వెంటనే అందజేయాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తుంకిమెట్లలో జాతీయ రహదారిపై భారాస నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. బొంరాస్‌పేట, దుద్యాల మండలాల భారాస అధ్యక్షులు యాదగిరి, చాంద్ పాషా, నాయకులు మహేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వికారాబాద్‌టౌన్, న్యూస్‌టుడే: రైతులకు పంట పెట్టుబడి సాయాన్ని వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఆదివారం భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ఆదేశాల మేరకు భారాస నాయకులు ఎన్‌టీఆర్ చౌరస్తాలో నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ..వర్షాకాలానికి రైతు భరోసా పోయినట్లే అని స్వయంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల చేసిన ప్రకటనపై మండిపడ్డారు. కార్యక్రమంలో భారాస పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్‌లో ఆందోళన చేస్తున్న భారాస నేతలు, కార్యకర్తలు

ప్రభుత్వ భూమిని గ్రామానికి కేటాయించాలి


ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న సిరిగిరిపేట గ్రామస్థులు

తాండూరు గ్రామీణ: సిరిగిరిపేటను ఆనుకొని ఉన్న 26 ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రామ అవసరాలకు కేటాయించాలని గ్రామస్థులు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని కోరారు. ఎమ్మెల్యేను ప్రజాభవన్‌లో గ్రామస్థులు ఆదివారం కలిశారు. గత ప్రభుత్వం సర్కారు భూముల్ని విక్రయించడంతో ఇటీవల కొందరు కంచె వేసి హద్దులు పాతేందుకు వస్తే అడ్డుకున్నామని వివరించారు.

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. పాత తాండూరులోని కోటేశ్వర దేవాలయం ఆవరణలో ఉన్న బాల విహార్ పాఠశాల నూతన భవనాన్ని ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. జీవితానికి చదువు అతి ముఖ్యమైందని తెలిపారు. పాఠశాలకు మైక్ సెట్ అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విపణి అధ్యక్షుడు పట్లోళ్ల బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు శోభారాణి, ప్రభాకర్‌గౌడ్, నాయకులు డాక్టరు సంపత్ కుమార్, పట్లోళ్ల నర్సింలు, భాజపా నాయకుడు రమేష్ కుమార్ పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న తిరుమలేష్

పరిగి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరిలో దేశభక్తి ఉండాలని తద్వారా మన దేశం శక్తిమంతమైన భారత్‌గా మారుతుందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తెలంగాణ ప్రాంత సహ వ్యవస్థ ప్రముఖ్ తిరుమలేష్ అన్నారు. ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన వీధుల గుండా పథ సంచలన్ నిర్వహించిన అనంతరం మినీ స్టేడియంలో శత జయంతి ఉత్సవాల సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రధానంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉన్నప్పుడే భారత్ సుసంపన్నంగా మారుతుందని అన్నారు. కార్యక్రమంలో పరిగి ఖండ సంఘచాలక్ బ్రహ్మయ్యచారి, రాష్ట్ర కిసాన్ మోర్చ ఉపాధ్యక్షుడు మారుతీ కిరణ్, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరమేశ్వర్‌రెడ్డి, వెన్న ఈశ్వరప్ప, భాజపా జిల్లా నాయకులు పెంటయ్యగుప్త, బాలకృష్ణారెడ్డి, నర్సింహా, రాముయాదవ్, రాంచందర్, మార్వాడీ సంఘం అధ్యక్షుడు మనోహర్, జిల్లా, ప్రాంత ప్రముఖులు పాల్గొన్నారు.

నేటి నుంచి అమర వీరుల సంస్మరణ కార్యక్రమాలు


నారాయణరెడ్డి, జిల్లా పోలీసు అధికారి

వికారాబాద్, న్యూస్‌టుడే: అమర వీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 21 నుంచి 31 వరకు పది రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పోలీసు అధికారి నారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా పోలీసు కవాతు మైదానంలో నేడు జరిగే పోలీసుల జెండా ఆవిష్కరణ, కవాతు, అమర వీరులకు నివాళ్లు, సంస్మరణ, రక్తదాన శిబిరం, ఓపెన్ హౌజ్ కార్యక్రమాలకు జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ హాజరవుతారన్నారు. మిగతా తొమ్మిది రోజుల పాటు పోలీసు శాఖ ఆధ్వర్యంలో అన్ని పోలీస్ ఠాణాల్లో ఓపెన్ హౌజ్ కార్యక్రమాలు నిర్వహించి పోలీసుల విధి విధానాలను, ఆయుధాల వివరాలను ప్రజలకు వివరిస్తామన్నారు.

రోడ్ల నిర్మాణానికి రూ.227.8 కోట్లు మంజూరు

తాండూరు, న్యూస్‌టుడే: తాండూరులో రోడ్ల నిర్మాణానికి రూ.227.8 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. గడచిన ఆగస్టు నెల 5న మంత్రులు కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేసిన శంకుస్థాపనలకు సంబంధించిన కొన్ని పనులకు పరిపాలన ఆమోదం లభిస్తే మరి కొన్ని పనులు టెండర్ ప్రక్రియలో ఉన్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని రోడ్లకు మహర్దశ రానుందని చెప్పారు.

ప్రమాదకర మలుపుల పరిశీలన


రాకంచర్ల వద్ద మాట్లాడుతున్న ఎస్ఐ

పూడూరు: జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణకు దృష్టి సారించి నాట్లు ఎస్ఐ మధుసూదన్ రెడ్డి అన్నారు. ఎస్పీ నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు 163 హైదరాబాద్, బీజాపూర్ నేషనల్ హైవే అథారిటీకి చెందిన నాందేవ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లతో కలిసి ఆదివారం మన్నెగూడ చౌరస్తా, చీలాపూర్ గేట్, పూడూరు గేట్ ,రాకంచర్ల గేట్, సోమన్‌గుర్తి గేట్, స్టీల్ ఫ్యాక్టరీ గేట్ వద్ద ప్రమాదకరంగా మారిన మలుపులను పరిశీలించారు. రాకంచర్ల మాజీ సర్పంచ్ మెంటయ్య, పోలీసు సిబ్బంది నాగేష్, నర్సిములు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేష్‌రెడ్డి

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే సీఎం రేవంత్‌రెడ్డి ఆశయమని, ఆయన ఆశయాలకు అనుగుణంగా టీచర్లు పని చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన బొంరాస్‌పేట, దుద్యాల మండలాల పీఆర్‌టీయూ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. త్వరలో బొంరాస్‌పేటలో గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు హరిలాల్, రాంరెడ్డి, విజయరామారావు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శశిధర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు

అందితే ప్రోత్సాహం.. అన్నదాతకు ప్రయోజనం

• చిరుధాన్యాల సాగుకు ప్రకటనలతో సరి • పోషకాహార లోప నివారణకు చక్కటి మార్గం

న్యూస్‌టుడే, పరిగి, వికారాబాద్ కలెక్టరేట్: ఆరోగ్య రక్షణ విషయంలో ప్రజల ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. కరోనా కాలం నుంచి ఆహారపు అలవాట్లలోనూ మార్పు వచ్చింది. కానీ ఆరోగ్యానికి మేలు చేస్తున్న చిరు ధాన్యాల సాగు మాత్రం అంతకంతకూ పడిపోతోంది. వీటి సాగును పెంచేందుకు నాలుగేళ్ల క్రితం గత ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించింది. అధిక పోషకాలు కలిగి ఉండే జొన్నలు, రాగులు, కొర్రలు, అరికెలు, వరిగెలు తదితరాలను 'న్యూట్రీ సిరియల్స్' వ్యవసాయ శాఖ పేర్కొంది. చౌకధరల దుకాణాల ద్వారా విక్రయాలకు అనుమతినిస్తూ ఇందుకోసం అప్పట్లో నోటిఫికేషన్‌ను కూడా జారీ చేసింది. దీంతో జిల్లాలోని అన్నదాతల్లో సర్వత్రా ఆనందం వ్యక్తమైంది. కానీ ఇప్పటివరకు మంచి నిర్ణయం అమలు కాకపోవడంతో నిరాశ ఎదురవుతోంది.

జొన్న 3,000 ఎకరాలు దాటలేదు

జిల్లాలో ప్రధానంగా నల్లరేగడి, ఎర్ర చెల్కనేలలు ఉన్నాయి. అవి దాదాపు అన్ని రకాల పంటల సాగుకు అనువు. ప్రస్తుతం మార్కెట్లోనూ చిరుధాన్యాలకు మంచి ధరలు పలుకుతున్నాయి. గత రబీలో ఆరువేల ఎకరాల్లో జొన్న సాధారణ సాగు ఉండగా అందులో సగానికి సగం కూడా సాగులోకి రాలేదు. సజ్జలు, కొర్రలు ఇతరత్రా వాటిని వేళ్లమీద లెక్కించాల్సి వస్తోంది.

మార్కెట్లో పలుకుతున్న ధరలు

రకం..	కిలో (రూ.)
తెల్ల జొన్నలు	50
పచ్చ జొన్నలు	50
ఉలవలు	100
బెబ్బర్లు	100
రాగులు	55
కొర్ర బియ్యం	80
సామలు	90
అరికెలు	80
ఊదలు	90

ప్రభుత్వమే కొనుగోలు చేస్తే..

చిరుధాన్యాలను మార్కెట్‌కు తరలిస్తే కొనుగోలుకు వ్యాపారులు గతంలో పెద్దగా ఆసక్తి చేపే వారు కాదు. ఈ కారణంగానూ సాగు పడిపోయింది. ఈ ప్రభావం ప్రజారోగ్యంపైనా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ పడింది. దీంతో చాలా మందిలో పోషకాహార లోపం కనిపిస్తోంది. ఇది ఎక్కువగా మహిళల్లో ఉంటోంది. పంటను ప్రభుత్వమే కొని రేషన్ దుకాణాల ద్వారా రాయితీపై అందించి ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడాలని తద్వారా సాగు విస్తీర్ణం మరింత పెరగడంతో పాటు ఆరోగ్య భాగ్యం కలుగుతుందని పలువురు కోరుతున్నారు.


సాగులో జొన్న పంట

సాగుపై చైతన్యం తెస్తున్నాం



ఆరోగ్య పరిరక్షణ విషయంలో చిరుధాన్యాలు ఎంతో మేలు చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో వినియోగం విపరీతంగా పెరిగింది. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతు వేదికల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. – మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి.

ప్రజా సమస్యలపై నిరంతర పోరు

తాండూరు: తాండూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం ప్రారంభమైన జిల్లా సీపీఎం మహాసభలు ఆదివారం ముగిశాయి. మహాసభలో జిల్లా సీపీఎం కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆర్.మహిపాల్ ప్రవేశపెట్టిన 18 తీర్మానాలకు సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎం నిరంతరం ప్రజాసమస్యలపై పోరాడుతుందన్నారు.

శౌర్యానికి ప్రతీక సేవా దీపిక

నేడు ఫ్లాగ్ డే


న్యూస్‌టుడే, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి అర్బన్, వికారాబాద్

ఎక్కడ ఘర్షణలు తలెత్తినా.. నాయకులు, ప్రజల మధ్య గొడవలు చోటుచేసుకున్నా ముందుగా ప్రత్యక్షమయ్యేది పోలీసే. రాత్రి, పగలు తేడా లేకుండా శాంతిస్థాపనే లక్ష్యంగా అలుపెరగక ముందుకు సాగుతున్న రక్షకులకు సెల్యూట్ చేయాల్సిందే. శాంతిభద్రతల రక్షణకు శ్రమించే ఎంతో మంది ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. సమాజాన్నే కుటుంబంగా భావించే ఖాకీలు అంకితభావంతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తున్నారు. సాంకేతికత తోడుగా నేరాలను ఛేదిస్తున్నారు. సేవా స్ఫూర్తి చాటుతూనే ప్రజా చైతన్యం తెస్తున్నారు. నేడు పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్‌డే) సందర్భంగా కథనం.

నాన్న బాటలో అడుగేసి..



మెదక్ జిల్లా పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌పై 1999 సెప్టెంబరు 13న రాత్రి మావోయిస్టులు జరిపిన దాడిలో ఒక హెడ్ కానిస్టేబుల్, నలుగురు కానిస్టేబుళ్లు ప్రాణాలు కోల్పోయారు. మృతి చెందిన వారిలో సంగారెడ్డికి చెందిన కానిస్టేబుల్ ప్రసాద్ ఉన్నారు. ఆయన రెండో కుమారుడు విద్యాసాగర్ నాన్న బాటలోనే నడవాలని నిర్ణయించుకున్నారు. ఈ శాఖలోనే చేరి ప్రస్తుతం మెదక్ జిల్లా పోలీసు కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా పని చేస్తున్నారు. - పాపన్నపేట



సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్

	సిద్దిపేట	సంగారెడ్డి	మెదక్	వికారాబాద్
పోలీసు స్టేషన్లు	27	32	21	19
అధికారులు, సిబ్బంది	1227	796	788	1191
హోంగార్డులు	208	274	146	696
కళాబృందం	01	01	01	03

ఆనాటి ఘటనలు..

● హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: 1991లో హుస్నాబాద్ సీఐ యాదగిరి, ఎస్సై జాన్‌విల్సన్ హుస్నాబాద్ మండలం రామవరంలో బస్సును పీపుల్స్‌వార్ దళ సభ్యులు బాంబుతో పేల్చివేయడంతో ప్రాణాలు కోల్పోయారు. దౌల్తాబాద్ ఎస్సై రాజగోపాలచారి, హెడ్‌కానిస్టేబుల్ చంద్రయ్య.. దౌల్తాబాద్ శివారులో నక్సలైట్ల కాల్పుల్లో మరణించారు. ● 1997 నవంబరు 17న శివ్వంపేట మండలం పిల్లుట్లలో నక్సల్స్ ఓ ఇంటిని పేల్చారు. దాని పరిశీలనకు వెళ్లిన అప్పటి తూప్రాన్ డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సీఐ వెంకటస్వామి, హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య, శ్రీనివాసరావు, సుజత్‌అలీ, లక్ష్మణ్‌నాయక్ మందుపాతర పేలుడులో చనిపోయారు. ● 2012 మార్చి 28న అర్ధరాత్రి వేళ కోహీర్‌లోని సిండికేట్ బ్యాంకులో అంతర్రాష్ట్ర ముఠా సభ్యులు కలిసి బ్యాంకు దోపిడీ చేస్తున్నట్లు సైరన్ మోగింది. స్థానిక పోలీసులకు సమాచారం అందగా ఎస్సై నోముల వెంకటేశ్, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ వెళ్లారు. వారిని పట్టుకునే యత్నంలో దోపిడీ దొంగలు నాటు తుపాకులతో కాల్చగా ఎస్సైకి తూటా తగిలింది. అయినా లెక్క చేయకుండా వారిని పట్టుకున్నారు.

స్నేహపూర్వకంగా..



వివిధ సందర్భాల్లో మహిళలకు బాసటగా నిలవడంలో 'స్నేహిత' ముందంజలో నిలుస్తోంది. సిద్దిపేట వన్‌టౌన్ పోలీసు ఠాణా సమీపంలో గతేడాది జనవరి 5న ఈ మహిళా సహాయక కేంద్రం ప్రారంభమైంది. ఇప్పటి వరకు 1,261 ఫిర్యాదులు స్వీకరించగా పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. పోలీసు స్టేషన్లలో నమోదయ్యే మహిళల కేసులు.. జిల్లా కేంద్రంలోని మహిళా పోలీసు ఠాణాకు, తదుపరి 'స్నేహిత'కు చేరవేస్తున్నారు. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో కొనసాగుతోంది. సీపీ డా. అనురాధ సమీక్షిస్తూ.. దిశానిర్దేశం చేస్తున్నారు. స్వార్డ్ సంస్థ కార్యదర్శి శివకుమారి పర్యవేక్షిస్తున్నారు. వారంలో ఒకరోజు న్యాయవాది అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. మూడు నుంచి ఐదుమార్లు కౌన్సెలింగ్ చేస్తున్నారు.

సైబర్ క్రైమ్ పోలీసు ఠాణాతో..



సైబర్ నేరాల అడ్డుకట్టపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గతేడాది ఆగస్టులో సిద్దిపేట పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ అందుబాటులోకి తెచ్చారు. ఏసీపీ, ఇన్‌స్పెక్టర్, ఐదుగురు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. రూ.లక్షకు పైగా సైబర్ మోసం జరిగితే ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. వివిధ స్థాయిల్లో దర్యాప్తును ఠాణాల వారీగా పోలీసులకు మార్గనిర్దేశనం చేస్తున్నారు. సాంకేతికతతో ఛేదిస్తున్నారు. సామాజిక మాధ్యమాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు.

30 గంటల్లో ..

సంగారెడ్డిలోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో అమ్మమ్మ, నాయనమ్మ కళ్లుగప్పి పసికందును గుర్తుతెలియని మహిళలు అపహరించారు. పోలీసులు సాంకేతిక సాయంతో 30 గంటల్లో ఛేదించారు. మనూరు మండలం దూదిగొండకు చెందిన అబ్బాస్, నసీమా దంపతులు. నసీమా ఈ నెల 8న ప్రసవానికి ఆసుపత్రిలో చేరగా ఆడపిల్ల జన్మించింది. మరుసటి రోజు ఇద్దరు మహిళలు పాపను ఎత్తుకెళ్లారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, పట్టణ సీఐ భాస్కర్‌లు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఎస్పీ చెన్నూరి రూపేష్ సూచనలతో సీసీ కెమెరాలను పరిశీలించారు. తనిఖీలు ముమ్మరం చేశారు. హైదరాబాద్‌లోని బోరబండలో నిందితులు ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లి వారిని పట్టుకున్నారు. పసికందును తల్లి ఒడికి చేర్చారు.




తల్లికి చిన్నారిని అప్పగించిన డీఎస్పీ, సీఐ

మూడు తరాల్లో..



ఇమామ్



జాని బాషా



నయీమ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా నకిరేకల్ మండలం గుండ్లపల్లికి చెందిన షేక్ ఇమామ్ సాహెబ్ కానిస్టేబుల్‌గా పని చేసి 1989లో పదవీ విరమణ పొందాడు. ఆయన స్ఫూర్తితో కొడుకు షేక్ జానిబాషా 1992లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. తూప్రాన్‌లో హెడ్ కానిస్టేబుల్ విధులు నిర్వర్తిస్తున్నారు. జానిబాషా కొడుకు షేక్ నయీమ్ పాషా హైదరాబాద్ కొండాపూర్‌లో కానిస్టేబుల్ శిక్షణ పొందుతున్నారు. మూడు తరాల వారు పోలీసుల శాఖలోనే ఉండటం గమనార్హం. - న్యూస్‌టుడే, తూప్రాన్

గజపాద ఘట్టం.. వీక్షించిన భక్తజనం



ఫసల్‌వాదిలో గజరాజు ప్రదర్శన



సామూహిక కుంకుమార్చనలో భక్తులు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ఆదివారం గజపాద ఘట్ట మహోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా విద్యాపీఠం నుంచి మంజీరా తీరం వరకు ఊరేగింపు చేపట్టారు. నదిలో గజరాజుకు స్నానం చేయించారు. అనంతరం విద్యాపీఠంలో నిర్మిస్తున్న ఆలయం చుట్టూ గజపాద ఘట్ట మహోత్సవం నిర్వహించారు. గజరాజుతో ప్రదర్శన చేపట్టారు. అనంతరం సామూహిక కుంకుమార్చన జరపగా.. స్థానిక భక్తులు పాల్గొన్నారు. ఆటపాటలు, కోలాటంతో అలరించారు. పీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి నష్టపరిహారం

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా చేగుంట మండలానికి చెందిన పాండ్యాల రాజుగౌడ్ తన కుటుంబంతో కలిసి బతుకుదెరువు నిమిత్తం పద్మానగర్ ఫేజ్2కు వచ్చి నివసిస్తున్నాడు. ఇంటి యజమానురాలు సురేఖ ఇంటి గోడలు షాక్ కొడుతున్నాయని చెప్పడంతో రాజుగౌడ్ వచ్చి పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వివేకానంద్ విద్యుత్తు అధికారులతో మాట్లాడి రూ.5 లక్షలు మంజూరు చేయించారు. ఆ చెక్కును ఎమ్మెల్యే రాజు భార్య నవ్యకు ఆదివారం అందజేశారు.

పురుగుమందు తాగి దంపతుల ఆత్మహత్య



ప్రతాప్‌సింగ్



కళావతి

ఝరాసంగం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో దంపతులు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం సంగారెడ్డి జిల్లా ఝరాసంగంలో ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ సీఐ హన్మంతు, ఎస్సై నరేశ్ వివరాల ప్రకారం.. ఝరాసంగానికి చెందిన బొందిల ప్రతాప్‌సింగ్(60), కళావతి(55) దంపతులు కొన్నేళ్లుగా కేతకి ఆలయ సమీపంలో అల్పాహారం, టీ స్టాల్ నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. కొన్నాళ్లుగా వ్యాపారంలో నష్టాలు రావడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ క్రమంలో తరచుగా భార్యాభర్తల మధ్య గొడవలు కూడా జరుగుతున్నాయి. ఆదివారం సాయంత్రం గ్రామ సమీపంలో వారి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన ఇద్దరు అక్కడే పురుగుమందు తాగి పడిపోయారు. చుట్టుపక్కల పొలాల రైతులు గుర్తించి వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. ఈ దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరికి వివాహాలు అయ్యాయి. కుమారుడు తల్లిదండ్రుల నుంచి వేరుగా ఉంటున్నాడు. ప్రతాప్‌సింగ్ సోదరుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాలువలో స్నానానికి దిగి మృత్యువాత



గోపాల్

న్యాల్‌కల్, జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: స్నానానికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం చాల్కీ గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హద్నూర్ పోలీసుల కథనం ప్రకారం... రంజోల్ గ్రామానికి చెందిన కమ్మరి గోపాల్(21) జహీరాబాద్, పస్తాపూర్, చాల్కీ ప్రాంతాల్లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వచ్చిన డబ్బులను నిత్యం మద్యం తాగడానికి ఖర్చు చేసేవాడు. రెండు మూడు రోజులుగా ఆయన పనికి వెళ్లడం లేదు. రెండు రోజుల కిందట చాల్కీలోని కొత్త కాలువకు స్నానానికి వెళ్లిన గోపాల్ ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. దీనికి ఎవరూ గుర్తించలేదు. ఆదివారం నీటిలో కనిపించిన మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. గోపాల్ మృతిపై అనుమానాలు లేవని, ప్రమాదవశాత్తు మృతిచెంది ఉంటాడని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

బస్సెక్కుతుండగా... ఆభరణాల చోరీ

నారాయణఖేడ్: ఓ మహిళ బస్సు ఎక్కుతుండగా బ్యాగు నుంచి గుర్తుతెలియని వ్యక్తులు 6.30 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన ఆదివారం స్థానికంగా చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... నాగల్‌గిద్ద మండలం ఎనక్‌పల్లికి చెందిన నిర్మల కొన్నేళ్లుగా కుటుంబీకులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నారు. సిర్గాపూర్ మండలం ఉజలంపాడ్‌లో బంధువుల ఇంట్లో ఓ శుభకార్యం నిమిత్తం వచ్చి తిరిగి వెళ్తుండగా ఖేడ్ రాజీవ్ కూడలిలో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలు ఖేడ్ ఠాణాలో ఫిర్యాదు చేయగా.. పోలీసులు విచారిస్తున్నారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	120-00	డ్రెస్డ్	206-00
రిటైల్	142-00	స్కిన్‌లెస్	234-00

పత్తి రైతులకు తప్పనున్న నిరీక్షణ

న్యూస్‌టుడే, గజ్వేల్, సంగారెడ్డి అర్బన్, మెదక్, పరిగి



గజ్వేల్ సీసీఐ కేంద్రంలో బారులు తీరి..

ఉమ్మడి మెదక్ జిల్లాలో వరి సాగు తర్వాతి స్థానం పత్తిదే. వికారాబాద్ జిల్లాలో ఇది మూడో స్థానంలో ఉంటుంది. ప్రస్తుతం పత్తి చేతికొచ్చే సమయం కావడంతో దీన్ని సాగు చేసిన రైతులు విక్రయించేందుకు మిల్లుల వద్ద పడిగాపులు నిరీక్షిస్తుంటారు. దీనికి ఇక నుంచి తెరపడనుంది. ప్రస్తుతం పొలాల క్రయ, విక్రయాలకు అమలు చేస్తున్న స్లాట్ విధానాన్ని పత్తి విక్రయాల్లోనూ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే నిర్మల్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న ఈ విధానాన్ని త్వరలోనే అన్ని జిల్లాల్లో శ్రీకారం చుట్టనుండటం విశేషం.

సీసీఐ కేంద్రాల్లో..

పొలాల నుంచి సేకరించిన పత్తిని సీసీఐ కేంద్రాల్లో అమ్మేందుకు వెళ్లే రైతులు ఒక్కోసారి జిన్నింగ్ మిల్లుల గేట్ల వద్ద నిరీక్షిస్తుంటారు. పలు సందర్భాల్లో అక్కడే నిద్రించి తమ వంతు ఎప్పుడొస్తుందా అని రోజులకొద్దీ ఎదురు చూసే పరిస్థితి. దీంతో ఎంతోమంది ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకొని నష్టపోతుంటారు. పత్తి కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని రైతులు ధర్నాలు చేసిన ఘటనలెన్నో ఉన్నాయి. వీటికి చెక్ పెట్టేందుకు కొత్త విధానం ఉపయోగపడనుంది.

54 స్పిన్నింగ్ మిల్లులు..

సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో 46 మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయి. మెదక్ జిల్లాలో మిల్లులు లేవు. ఇక్కడి వారంతా సంగారెడ్డి, సిద్దిపేటకు వెళ్తుంటారు. వికారాబాద్ జిల్లాలో 8 మిల్లులు ఉన్నాయి.

ఎలా చేస్తారంటే..

పత్తి రైతులు ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తేదీ, సమయం సూచిస్తూ సమాచారాన్ని రైతుల చరవాణికి పంపిస్తారు. ఆరోజు నేరుగా కేటాయించిన మిల్లుకు దిగుబడిని తీసుకొచ్చి అమ్ముకోవచ్చు.

సిద్దిపేట ■ సంగారెడ్డి ■ మెదక్ ■ వికారాబాద్ ■

నాలుగు జిల్లాల్లో పత్తి సాగు (లక్షల ఎకరాల్లో)

సిద్దిపేట	సంగారెడ్డి	మెదక్	వికారాబాద్
3.35	1.04	0.36	2.5

జిన్నింగ్ మిల్లులు

సిద్దిపేట	సంగారెడ్డి	మెదక్	వికారాబాద్
24	22	00	08

మద్దతు ధర

పొడవు రకం: రూ.7521

మధ్య రకం: రూ.7121

పంట రక్షణ తీగ.. ప్రాణం తీసింది

తల్లి, అన్న కళ్లముందే తమ్ముడి దుర్మరణం



బాలరాజు

పరిగి, పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: ఇద్దరు కొడుకులు తల్లి కలిసి.. సీతాఫలాలు అమ్మారు. చీకటి పడగానే.. ముగ్గురూ ముచ్చట్లోపడి.. ఇంటి దారి పట్టారు. అంతలోనే.. ముందు నడుస్తున్న చిన్నకొడుకు కాలికి విద్యుత్తు తీగ తగిలింది. గిలగిలా కొట్టుకుంటున్న ఆ బిడ్డను రక్షించలేక.. తన తమ్ముడు తన కళ్లముందే.. మృత్యువుతో పోరాడుతున్నా.. ఏం చేయలేని నిస్సహాయతతో ఇద్దరూ విలవిల్లాడారు. పరిగి మండలం రంగంపల్లిలో ఈ విషాదకరఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. రంగంపల్లి గ్రామానికి చెందిన ఎలిచెలి పార్వతమ్మకు ఇద్దరు కుమారులు రాములు, బాలరాజు (28) ఉన్నారు. వారంతా వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో సీతాఫలాలు విక్రయిస్తున్నారు. అడవిలో సేకరించిన ఫలాల్ని బీజాపూర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న చింతల్‌చెరువులో అమ్మకాలు సాగిస్తున్నారు. శనివారం ముగ్గురూ కలిసి కాయలను అమ్మకాలు జరిపారు. తిరుగు ప్రయాణంలో అదే గ్రామానికి చెందిన కౌలు రౌతు పిట్ల వెంకటయ్య పొలం దారిలో ఇంటికి వెళుతున్నారు. రైతు అడవి పందుల నుంచి రక్షణకు ఏర్పాటు చేసిన.. విద్యుత్తు తీగపై బాలరాజు కాలు పడింది. దీంతో కరెంటు సరఫరా జరిగి ఒక్కసారిగా కిందపడి కొట్టుకుంటున్నాడు. అతడిని కాపాడేందుకు తల్లి ప్రయత్నించగా.. రాములు వెంటనే తల్లిని వెనక్కి జరగాలని బిగ్గరగా అరిచాడు. అంతే.. ఆమె వెనక్కి జరగగా.. క్షణాల్లో బాలరాజు అచేతనంగా పడిపోయాడు. వారి కేకలు విన్న గ్రామస్థులు అక్కడికి చేరుకున్నారు. విద్యుత్తు సరఫరా నిలిపివేసి పరిశీలించగా.. యువకుడు తుది శ్వాస విడిచాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వాహనం మలుపు తీసుకుంటుండగా ప్రమాదం.. మెకానిక్ మృతి



స్వామి

బెజ్జంకి, న్యూస్‌టుడే: రాజీవ్ రహదారి కూడలిలో మలుపు తీసుకుంటున్న ద్విచక్ర వాహనదారుడిని కారు వేగంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా బెజ్జంకి క్రాసింగ్‌లో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి సమాచారం ప్రకారం.. గ్రామానికి చెందిన బింగి స్వామి(42) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ నెల 19న గాగిల్లాపూర్‌లో పని నిమిత్తం తన వాహనంపై వెళ్లి తిరుగుపయనమయ్యాడు. పెట్రోల్ పోసుకునేందుకు గ్రామ శివారులో మలుపు తీసుకుంటుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న కారు ఢీ కొట్టింది. ప్రైవేటు ఆస్పత్రికి స్వామిని తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుమారుడు వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బైకు అదుపుతప్పి రైతు..



నర్సింలు

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందిన ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట- భూంపల్లి మండలం ఖాజీపూర్ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం గాజులపల్లిలో పోచమ్మ ఆలయం నిర్మాణం చేపడుతున్నారు. గ్రామానికి చెందిన రైతు గొల్లపల్లి చిన్న నర్సింలు (58) మరికొందరు గ్రామస్థులతో కలిసి తుజాల్‌పూర్‌లోని ఆలయ నమూనాను పరిశీలించడానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వాహనం అదుపుతప్పి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధులకు ఆరోగ్య భరోసా

ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సిద్దిపేట, మెదక్, వికారాబాద్ కలెక్టరేట్



సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ వార్డు

వృద్ధాప్యంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ వయసులో ఉన్న వారిని పసి పిల్లలుగా కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి ఉంటుంది. కొంత మందికి కుమారులు ఉన్నా వేదనే మిగులుతోంది. రోగాలబారిన పడ్డా ఎవరూ పట్టించుకోరు. ఇలాంటి కష్టకాలంలో ఉన్న వయోవృద్ధులకు మేమున్నాం అంటూ భరోసా కల్పించేలా ఉచిత వైద్య సేవలు అందించాలని కేంద్రం సంకల్పించింది. ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఈ ప్రక్రియ అమలు చేయనుంది. ఇందుకు వారి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయనున్నారు.

1835 రకాలుగా..

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అన్ని వయసుల వారికి రూ.10 లక్షల వరకు వైద్య సేవలు అందిస్తున్న విషయం విదితమే. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఈ సేవలు అందిస్తున్నారు. ఈ పథకం కింద 1835 రకాల రోగాలు ఉన్న వారికి దీన్ని వర్తింపజేస్తున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలుచేస్తోంది. దీని కింద వయోవృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించాలని నిర్ణయం తీసుకోవడంతో నాలుగు జిల్లాల వారికి మేలు చేకూరనుంది.

జిల్లాల్లో వయోవృద్ధులు

జిల్లా	వయోవృద్ధులు
సంగారెడ్డి	61,991
సిద్దిపేట	40,360
మెదక్	32,130
వికారాబాద్	39,153

దరఖాస్తు ఇలా..

ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (ఏబీపీఎంజేఏవై) వెబ్‌సైట్ https:///ayushmanup.in ను సందర్శించాలి. అందులో ఆయుష్మాన్ భారత్(ఏఎంఐ) ఎలిజిబుల్ ట్యాబ్‌పై క్లిక్ చేయాలి. చరవాణి నంబరు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. దానితో ధ్రువీకరించుకోవాలి. గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రం వివరాలు, ఆధార్ కార్డు వివరాలు నమోదు చేయాలి. ఇలా ఈ-కేవైసీ పూర్తవగానే ఆమోదం కోసం వేచి ఉండాలి. ఈ ప్రక్రియ పూర్తయితే కార్డు తెరపై కనిపిస్తుంది. దాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

యాప్‌లో నమోదుకు..:



కేంద్రం ఆయుష్మాన్ భారత్ పథకం కింద 70 ఏళ్ల పైబడిన వయోవృద్ధులకు ప్రత్యేకంగా కార్డులు జారీ చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. మీసేవ, కామన్ సర్వీస్ సెంటర్లలో కార్డులు పొందవచ్చు.

నరేష్, రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్, జిల్లా సమన్వయకర్త, సంగారెడ్డి

ప్రయోజనాలిలా..

రూ.5 లక్షల వైద్య సాయం పొందే వీలుంది. మూడు రోజుల పాటు ఉచితంగా ఆసుపత్రిలో చేర్చుకోవడం, వైద్య పరీక్షలు, చికిత్స, ఇంటెన్సివ్‌కేర్ తదితర సేవలు పొందవచ్చు. దవాఖానాలో చేరాక 15 రోజుల వరకు సంరక్షణ ఉచితంగా లభిస్తుంది. మందులు, వసతి, పోషకాహారం అందజేస్తారు.

క్రీస్తును స్మరించి.. భక్తితో ఆరాధించి



భక్తిగీతాలు ఆలపిస్తున్న భక్త బృందం

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: క్రీస్తు నామస్మరణతో ప్రఖ్యాత మెదక్ సీఎస్ఐ చర్చి ఆదివారం సందడిగా మారింది. గురువులు శిలువను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రార్థనా మందిరంలో ప్రతిష్ఠించారు. మెదక్ ప్రెసిబేటరి ఇన్‌ఛార్జి శాంతయ్య ఆధ్వర్యంలో ఆరాధనలు చేపట్టారు. ఆయనతో పాటు వనస్థలిపురం ప్రెసిబేటరీ ఇన్‌ఛార్జి జాన్ సుందర్ దైవసందేశాన్ని వినిపించారు. ఉమ్మడి జిల్లాతో పాటు పొరుగు జిల్లాల, రాష్ట్రాల నుంచి భక్తులు, పర్యాటకులు కుటుంబ సమేతంగా తరలివచ్చి ఏసయ్యను దర్శించుకుని తన్మయత్వం పొందారు. భక్త బృందం క్రీస్తును స్తుతిస్తూ పాడిన పాటలు అలరించాయి. గురువులు డేవిడ్ రిచర్డ్, జైపాల్, శ్రీనివాస్ భక్తులకు ఆశీర్వచనాలు అందించారు.

స్వర్ణోత్సవ ఆత్మీయ సమ్మేళనం



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కళాశాలలో 1972-75 బీఎస్సీ ఎంపీసీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. 50 వసంతాల తర్వాత అంతా ఒకచోటుకు చేరి ఆత్మీయంగా పలకరించుకుంటూ తమ మధురజ్ఞాపకాలు పంచుకున్నారు. వీరిలో ప్రముఖ కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రథమ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ నాగభూషణం, భాజపా రాష్ట్ర నాయకులు వంగ రాంచంద్రారెడ్డి, వీహెచ్‌పీ తెలంగాణ పూర్వ ఆర్గనైజర్ గాల్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు కొమురవెల్లి అంజయ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.అయోధ్యరెడ్డిని సన్మానించారు.

సాఫ్ట్‌బాల్ పోటీల విజేత నిజామాబాద్ జట్టు



నిజామాబాద్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సీఐలు కంప రవీందర్, రాఘవేందర్ తదితరులు

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2024-25 పోటీల్లో నిజామాబాద్ జట్టు మొదటి, మహబూబ్‌నగర్ జట్టు ద్వితీయ, మెదక్ జట్టు తృతీయ పతకాలు సాధించినట్లు వరంగల్ జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్ తెలిపారు. రామగుండం స్పెషల్‌బ్రాంచ్ సీఐ కంప రవీందర్, ఎనుమాముల సీఐ రాఘవేందర్ విజేతలకు బహుమతులు అందజేశారు. వరంగల్ రెడ్డిపాలెంలోని ఇన్ఫాంట్ జీసస్ కాన్వెంట్ పాఠశాలలో ఆదివారం జరిగిన ముగింపు సమావేశాల్లో ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. జీవితంలో గెలుపు కోసం నిరంతరం శ్రమించాలని క్రీడాకారులకు సూచించారు. సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి పూజారి అశోక్‌బాబు, బీమగాని ముఖర్జీ, పాఠశాల ప్రిన్సిపల్ మరియమ్మ మాధ్యూ పాల్గొన్నారు.

భాషల పరిరక్షణ తప్పనిసరి: వీసీ



అవార్డు గ్రహీతలు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : భారతీయ భాషలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్ రావు ఉద్బోధించారు. లేకుంటే భవిష్యత్తులో ప్రమాదంలో పడతాయన్నారు. అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా కళాశాలలో సదస్సు చేపట్టారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన సాహితీవేత్తలకు అవార్డులు, పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో డీకే ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.గిరి, అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ జాతీయ అధ్యక్షులు వీరేంద్రసింగ్, ప్రధాన కార్యదర్శి చతుర్వేది, తెలంగాణ అధ్యక్షులు సత్యమూర్తి, కార్యదర్శి చక్రవర్తి, మద్రాస్ విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎలిజబెత్ జయకుమారి, ఒడియా కవయిత్రి సుశ్రీసంగీత మిశ్ర, ఆంగ్ల కవి లక్ష్మణరావు, హిందీ రచయిత రామలింగేశ్వరరావు, నారాయణ ఐఏఎస్ అకాడమీ ప్రిన్సిపల్ కె.సరోజినీదేవి, కవి పెరుగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలలకు సంస్కృతి, సంప్రదాయ పాఠాలు



బాలగోకులం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తాండూరు టౌన్: పట్టణంలో చిన్నారులకు ఆదివారం బాలగోకులం నిర్వహించారు. ఆదర్శతులసీనగర్ కాలనీలో వెలిసిన వరసిద్ధి వినాయక దేవాలయం, సాయిపూరులోని భవానీనగర్ కాలనీలోని శివాలయంలో చిన్నారులకు దేశభక్తి గేయాలు, భగవద్గీత శ్లోకాలు, రామాయణం, మహా భారతం, పొడుపు కథలు, నీతి వాక్యాలు, నీతి కథలు బోధించారు.

ఉద్యోగంలో చేరిన యువతకు సత్కారం



కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు

పరిగి,న్యూస్‌టుడే: మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బి. వెంకటయ్య, అంబేడ్కర్ విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ముత్యం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన యువతకు పట్టణంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. మహనీయుల ఆశయ సాధనకు అంకితభావంతో పాటు సేవాభావంతో పనిచేయాలని కోరారు.

పెరటితోట.. ఆరోగ్య బాట

ఇంటి ఆవరణలో కూరగాయలు పండిస్తున్న మహిళలు

న్యూస్‌టుడే, పరిగి, దుద్యాల:

రసాయనిక ఎరువులు వాడకుండా మహిళలు పెరటి తోటలను చేపడుతున్నారు. ఇళ్ల ముందు ఉన్న ఖాళీ ప్రదేశాల్లో బీర, బెండ, చిక్కుడు, దొండ, గోకర, కాకర, మిరప, వంకాయ, సొర తదితర రకాల కూరగాయలను సాగు చేసుకుంటున్నారు. ఏ రోజుకు అవసరమైన వాటిని ఆరోజు వాడుకుంటున్నారు. దీంతో ఆరోగ్యం, డబ్బులను ఆదా చేసుకుంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కూరగాయల ధరలు భగ్గున మండుతున్నాయి. దీనికి తోడు నిత్యావసర సరకుల ధరలు అదే రీతిన పెరుగుతున్నాయి. వీటిని అధిగమించేందుకు అతివలు ప్రయత్నిస్తున్నారు.

సేంద్రియ ఎరువుతో పండిస్తున్నాం

ఇంటిముందు ఉన్న ఖాళీ ప్రదేశంలో రసాయన ఎరువులు, పురుగు మందులను వాడకుండా కేవలం పశువుల పేడతోనే కూరగాయలు పండించుకుంటున్నాం. స్వతహాగా ఇంటి ముందు పండించిన తాజా కూరగాయలు తింటున్నాం. దీంతో ఆరోగ్యం కూడా బాగుంటోంది.



– అనూష, సోమ్లానాయక్‌తండా



సోమ్లానాయక్‌తండాలో సాగు చేసిన పెరటి తోట

నెలవారీ ఖర్చు విగులుతోంది

మాలాంటి సామాన్యులకు కూరగాయల ధరలు వింటేనే భయమేస్తోంది. దాదాపు రూ.60నుంచి రూ.80 వెచ్చిస్తేనే కిలో కూరగాయలు కొనాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో డబ్బులు పెట్టి కొనే స్థోమత లేదు. మా పెరట్లో పండిన కూరగాయలతోనే సరిపెట్టుకుంటూ.. నెలకు రూ.500 మేర ఖర్చు ఆదా చేసుకుంటున్నాం.



– మడిగెల సాయమ్మ, దుద్యాల

రూ.వెయ్యి ఆదా అవుతున్నాయి



కొంత కాలంగా కూరగాయల ధరలకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. వాటిని కొనాలంటే సాధ్యం కావడం లేదు. దీంతో ఇంటివద్దనే పాలకూర, గోంగూర, వంకాయ, టమాట, మిరప, కాకర వంటి తీగజాతి కూరగాయలను కూడా పెంచుతున్నాం. నెలకు రూ.వెయ్యి వరకు ఆదా చేసుకోవడం సంతోషంగా ఉంది.

– సొండేపూర్ అనిత, రంగంపల్లి, పరిగి మండలం

దోమ: ? పరిగి- కోస్గీ ప్రధాన దారి, దోమ- దాదాపూర్ మధ్య రోడ్లు గుంతలు పడ్డాయి. రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మరమ్మతు చేయండి. – గోవర్ధన్, ఐనాపూర్

✓ ఆశాఖ అధికారులకు తెలిపి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. – మహేష్‌బాబు, ఎంపీడీవో దోమ

న్యూస్‌టుడే, తాండూరు టౌన్: ? శాంతినగర్‌కాలనీలోని ఉద్యానం అధ్వానంగా మారింది. అభివృద్ధికి చర్యలు తీసుకోండి. – రాజు

✓ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. – విక్రమసింహారెడ్డి, పురపాలక సంఘం కమిషనరు తాండూరు.

న్యూస్‌టుడే, కుల్కచర్ల: ? కుల్కచర్ల మండల కేంద్రంలోని కల్యాణ్ నగర్ ప్రధాన రహదారి 33 అడుగుల వెడల్పు ఉండగా.. ఇరువైపులా ఇళ్ల నిర్మాణాలు చేసే వారు రోడ్డువైపు జరిగి నిర్మాణం చేస్తున్నారు. చర్యలు తీసుకోండి. – కృష్ణ, కుల్కచర్ల

✓ పరిశీలన చేసి చర్యలు తీసుకుంటాం.

–మురళీధర్, ప్రత్యేకాధికారి కుల్కచర్ల

న్యూస్‌టుడే, కుల్కచర్ల గ్రామీణ: ? రాంరెడ్డిపల్లి చౌరస్తాలో ఆకాశ దీపాలు పాడైపోయి చాలా రోజులు కావస్తోంది. సమస్య పరిష్కరించగలరు. – నర్సింలు, స్థానికుడు

✓ గ్రామంలో వీధి దీపాల సమస్యను ఎప్పటికప్పుడూ పరిష్కరించేలా చూస్తున్నాం. వీలైనంత త్వరగా బాగుచేసేలా చూస్తాం.– కరుణాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి.

న్యూస్‌టుడే, పూడూరు: ? గ్రామం నుంచి మన్నెగూడ వైపు వెళ్లే ప్రధాన దారిలో వాగువద్ద గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు పట్టించుకోవటం లేదు. – శంకరయ్య, ఎన్కెపల్లి

✓ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే మరమ్మతులు చేయిస్తాం.

– వెంకటేశ్వరమ్మ, ప్రత్యేకాధికారిణి.

అమ్మో.. ఆ రోడ్డులో వెళ్లలేం!

ఇబ్బందికరంగా షాద్‌నగర్ రోడ్డు

న్యూస్‌టుడే, పరిగి: గ్రామీణ రోడ్ల పరిస్థితి మెరుగుపడటం లేదు. పల్లె ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ పరిస్థితులు మారక ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయో తెలియని భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ఇందుకు ఉదాహరణగా షాద్‌నగర్, లఖ్నాపూర్ రోడ్లను పేర్కొనవచ్చు. ప్రధానంగా షాద్‌నగర్ రహదారి పేరు వింటేనే వాహన చోదకుల వెన్నులో వణుకు పడుతోంది. ఇరుకైన రహదారి కావడం, వాహనాల రాకపోకలు పెరగడంతో అవస్థలు తప్పడం లేదు.

ఇదిగో ఇలా..

పరిగి నుంచి షాద్‌నగర్ రోడ్డులో మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చే 800 మీటర్ల దూరం రెండు వరసలుగా మార్చడం రోడ్డుకు ఇరువైపులా మురుగు కాల్వల నిర్మాణం చేపట్టి డివైడర్లను ఏర్పాటు చేస్తామని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. దీంతో ఆర్అండ్‌బి అధికారులు ఆపనిని దానిని వదిలిపెట్టారు. అది రానురాను గుంతలు పడి ప్రజల ప్రాణాలమీదకు వస్తోంది. నిత్యం ప్రజల నుంచి రోడ్లు, భవనాల శాఖ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఎర్రమట్టితో నెల



షాద్‌నగర్ దారి



దెబ్బతిన్న మోత్కూరు- దిర్సంపల్లి మార్గం

రోజుల క్రితం గుంతలు నింపారు. కానీ వాహనాల రాకపోకలతో ద్విచక్ర వాహదారుల కళ్లలో పడటం, పరిసర ఇళ్లలోకి ఎర్రటి దుమ్ము చేరి అనారోగ్యం బారిన పడుతున్నారు. ఆరు కిలోమీటర్ల దూరం ఉన్న లఖ్నాపూర్ రోడ్డు కూడా మరింత అధ్వానంగా మారింది.

వెన్నునొప్పి వస్తోంది

- గంగాధర్, ఉపాధ్యాయుడు

షాద్‌నగర్ రోడ్డు అంటేనే గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఉద్యోగ రీత్యా ప్రాణాలను పణంగా పెట్టుకుని నిత్యం ప్రయాణించాల్సి వస్తోంది. అడుగులోతు గుంతలు ఉండటం, వర్షాలకు అందులో నీరు చేరి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇది ఇటు మహబూబ్‌నగర్‌కు అటు షాద్‌నగర్ జిల్లా కేంద్రాలకు ప్రధాన రహదారి అయినా పట్టించుకోకపోవడం గమనార్హం.

త్వరలో మరమ్మతులు

-సురేందర్, డీఈఈ, ఆర్అండ్‌బి

గుంతలు పడిన షాద్‌నగర్ రోడ్డును త్వరలోనే మరమ్మతు పనులు చేపడతాం. సాంకేతిక కారణాలతో నిలిచిన పోయిన పనులను పూర్తిచేసి ప్రజలకు రవాణా సదుపాయాలు మెరుగు పరుస్తాం.

చదువుకున్న బడిలోనే కొలువు



దుద్యాల పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న రమేష్

దుద్యాల, న్యూస్‌టుడే: లగచర్ల గ్రామానికి చెందిన కావలి రమేష్ పదో తరగతి వరకు జడ్పీహెచ్‌ఎస్ దుద్యాల పాఠశాలలో చదువుకున్నాడు. కష్టపడి చదివి డీఎస్సీ పరీక్షలో స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్రంలో జిల్లా 2వ ర్యాంక్ సాధించి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాడు. తాను చదువుకున్న పాఠశాలకే ఉపాధ్యాయుడిగా రమేష్‌ను అధికారులు కేటాయించడంతో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నాడు. చిన్నప్పుడు చదువుకున్న స్మృతులను గుర్తు చేసుకుంటూ.. ప్రస్తుతం విద్యార్థులకు పాఠాలు బోధిస్తుండటంతో ఆయన ఆనందానికి అవధుల్లేవు.

బావిలోపడి వ్యక్తి మృతి

పూడూరు, న్యూస్‌టుడే: బావిలోపడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన పూడూరులో చోటు చేసుకుంది. వివరాల. . నవాబ్‌పేట మండలం ఎల్లకొండకు చెందిన కిషోర్ (25) కొంత కాలంగా పూడూరు మండల కేంద్రంలో ఉంటూ.. దర్జీ పని చేస్తున్నాడు. ఆదివారం గ్రామంలోని చేదబావిలో ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందాడు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం పోలీసులు పరిగికి తరలించారు.

నాణ్యమైన విద్యా సేవలందించండి

బషీరాబాద్, న్యూస్‌టుడే: కొత్తగా ఎన్నికైన ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యా సేవలు అందించాలని భారాస మండల అధ్యక్షుడు ఇందర్‌చేడ్ నర్సిరెడ్డి అన్నారు. ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సత్కరించారు.

ఆరోగ్య శిబిరాలతో మేలు

మోమిన్‌పేట, న్యూస్‌టుడే: గ్రామీణ నిరుపేదల కోసం నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలు మేలు చేస్తున్నాయని నిర్వాహకుడు కొప్పుల రాజశేఖర్ అన్నారు. ఆదివారం వెల్చాల్ గ్రామంలో శారద ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. 260 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేసి మాట్లాడారు.

నిఘా కెమెరాల ధ్వంసం



నేలవైపు సీసీ కెమెరా ఇలా..

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కరణ్‌కోట జడ్పీ ఉన్నత పాఠశాల పరిసరాల్లో అమర్చిన సీసీ కెమెరాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. వాటిని అమర్చి పట్టుమని పదిహేను రోజులు గడవకముందే దెబ్బతీయడం చర్చనీయాంశమైంది. రెండు వారాల క్రితం సమీపంలోని సిమెంటు కర్మాగార యాజమాన్యం పాఠశాల పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించింది. అయితే వీటిని ధ్వంసం చేయడంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వేసవి సెలవుల్లో పాఠశాలలోకి ప్రవేశించిన ఆకతాయిలు బల్లలు, వందల సంఖ్య పాఠ్యపుస్తకాలకు నిప్పంటించారు. స్థానికులు గమనించి మంటలను ఆర్పేయగా అప్పటికే పుస్తకాలు కాలిబూడిదయ్యాయి. జూన్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద మంజూరైన నిధులతో తాగునీటి నల్లాల వద్ద టైల్స్‌ను అమర్చగా రెండు రోజుల వ్యవధిలోనే ధ్వంసం చేశారు. దీంతో జూన్ 12న పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డికి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే వెంటనే దెబ్బతిన్న టైల్స్‌ను పరిశీలించారు. ఆకతాయిలను గుర్తించి చర్యలు చేపట్టాలంటూ అక్కడే ఉన్న ఎస్సై విఠల్‌రెడ్డికి సూచించారు. అయినప్పటికీ ఆకతాయిలను గుర్తించకపోవడం, ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వరుస ఉదంతాలు జరుగుతున్నాయంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డ్రోన్ల ఆగమనం.. సాగు సులభం

పల్లెల్లో అందిపుచ్చుకుంటున్న సాంకేతికత

న్యూస్‌టుడే, పూడూరు, కొడంగల్ గ్రామీణ

అన్నదాతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు అందుబాటులోకి వస్తుండటంతో కాస్త ఊరట కలిగిస్తుంది. కంది, వరి, పత్తి తదితర పంటలకు డ్రోన్‌తో మందులు పిచికారీ మొదలైంది. వేగంగా పనులు పూర్తి చేయడం, తక్కువ ధరకే ప్రక్రియ పూర్తికావడంతో.. చాలా మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ఇదీ పరిస్థితి..

డ్రోన్ సహాయంతో మందు పిచికారీ చేయటంతో మందులు ఆదా అవుతున్నాయి. డ్రోన్‌తో నాలుగు నుంచి ఐదు నిమిషాల్లోనే పని పూర్తవుతుంది. ఎకరం మందు రెండెకరాలకు వస్తుంది. పది. పన్నెండు లీటర్ల నీరు సరిపోతుంది. కూలీల ఖర్చులు తప్పుతున్నాయి. పొలం యజమాని ఒక్కరు ఉంటే సరిపోతుంది. పిచికారీ కోసం ఎకరానికి రూ.450 నుంచి రూ.500 తీసుకుంటున్నారు. ఒక రోజుకు 20 నుంచి 30 ఎకరాల వరకు మందులు పిచికారీ చేసుకునే ఆస్కారం ఉంది. వారికి అనుకూలంగా ఉన్న పొలాలకు వెళ్తున్నారు. గ్రామాల్లో కొందరు యువకులు డ్రోన్‌లను కొనుగోలు చేసుకుని అద్దెకు నడుపుతూ స్థానికంగా ఉపాధి పొందుతున్నారు. ఖర్చులు తగ్గి రైతులకు మేలు కలగడంతో యువతకు ఉపాధి లభించినట్లవుతుంది. ఈ ప్రాంతం అధికంగా వ్యవసాయమే కావటంతో అన్ని కాలాల్లోనూ పని దొరుకుతుంది.



దుద్యాల మండలం లగచర్లలో డ్రోన్‌తో మందు పిచికారీ

చేతిపంపులతో ఇలా..

రైతులు చేతిపంపు, ఛార్జింగ్ పంపు, పెట్రోల్‌తో నడిచే పంపులతో పంటలకు మందు పిచికారీ చేస్తుంటారు. ఎకరం మందు గంట నుంచి రెండు గంటల వరకు సమయం పడుతుంది. నాలుగు ఐదు ఎకరాలు ఉంటే రోజంతా అవుతుంది. ఎకరానికి 100 లీటర్లకు పైగానే నీరు అవసర పడుతుంది. ఒకరు నీరు పోయడం మరొకరు మందు పిచికారీ చేయటం కోసం ఒక్కో కూలీకి రోజుకు రూ.700 అవుతుంది.

నాలుగు ఎకరాల్లో కంది సాగుచేశా

సాయన్న రైతు, దుద్యాల

చెల్క పొలం కావటంతో వేరే పంటలు పండవు దీంతో ఏటా కంది పంటను సాగు చేస్తున్నాను. ప్రస్తుతం నాలుగు ఎకరాల్లో సాగులో ఉంది. పూత, కాతలో ఉండగా ఇటీవల మంచు తీవ్రంగా వచ్చింది. గ్రామానికి డ్రోన్ రావటంతో ఎకరానికి రూ.500 చెల్లించి మందు పిచికారీ చేయించాను.

కొనుగోలుకు రాయితీ ఉంది

తులసీరాం, ఏవో, పూడూరు

డ్రోన్ కొనుగోలుకు రాయితీపై తీసుకునేందుకు అవకాశం ఉంది. రెండేళ్ల క్రితం రైతు సంఘాలుగా ఏర్పడి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మాత్రమే అర్హులు, మార్కెట్‌లో ధర రూ.10 లక్షలు ఉంటే రూ.5 లక్షలు రాయితీ వర్తిస్తుంది.



ధారూర్‌లో రోడ్డుపై కూర్చున్న నాయకులు



దౌల్తాబాద్‌లో ధర్నా



చౌడాపూర్ మండల కేంద్రంలో..

కాంగ్రెస్ హామీలు విఫలం: భారాస

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యిందని భారాస నాయకులు ఆరోపించారు. జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు భారీగా ధర్నాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతు రుణ మాఫీ పూర్తి స్థాయిలో కాలేదన్నారు. రైతు భరోసా డబ్బులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.- **న్యూస్‌టుడే, బృందం**

కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత



చెక్కు అందజేస్తూ...

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: తాండూరు పట్టణం షావుకార్ పేట్ ప్రాంతానికి చెందిన కావలి రవీందర్ ఈ నెల 6న గుండెపోటుతో మృతి చెందారు. సహచర బృందం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, నిజామాబాద్ 2011 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు అతని కుటుంబానికి రూ.2.05 లక్షలు ఆదివారం అందజేశారు. కానిస్టేబుళ్లు వెంకటేశ్, జయప్ప, సురేష్‌గౌడ్, అశోక్, సత్తార్, శాంతు, ప్రవీణ్, రాంచందర్, పాండు, కృష్ణ, గోపాల్, వినోద్, రామకృష్ణ, ప్రవీణ్, నర్సింలు, మహేష్ పాల్గొన్నారు.

స్తంభాలు మార్చరా?



కుల్కచర్ల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా నుంచి చిన్నగేటు వరకు రహదారి పనులు కొనసాగుతున్నాయి. గత ఏడాది ఒక వరుస రోడ్డు నిర్మించగా, ప్రస్తుతం మరో వరుస పని జరుగుతోంది. కానీ పేటగడ్డ కాలనీ నుంచి చిన్నగేటు వరకు రహదారిలో గతంలో పాతిన విద్యుత్తు స్తంభాలు ఉన్నాయి. వాటితో విస్తరణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అక్కడి నుంచి తొలగించి పనులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వేగనియంత్రికలతో మేలు

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: ముజాహిద్‌పూర్, కామన్‌పల్లి, ఘనాపూర్ చౌరస్తాల్లో వేగ నియంత్రికలు ఏర్పాటు చేయించాలని కుల్కచర్ల మండల విద్యార్థి సంఘాల నాయకులు మహిపాల్, నర్సింలు ప్రకటనలో డిమాండ్ చేశారు. చౌరస్తాల్లో వాహనాలు మితిమీరిన వేగంతో వెళ్లడంతో పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పరిగి, న్యూస్‌టుడే: ఓ స్నేహితుడి కుటుంబానికి పలువురు అండగా నిలిచారు. పరిగి మండలం రూప్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన పెంటయ్య ఇటీవల మృతి చెందాడు. 1996 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పలువురు స్నేహితులు రూ.85వేలు నగదుతో పాటు నెలకు సరిపడా నిత్యావసరాలను ఆ కుటుంబానికి అందించారు.

యాలాల: లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన బోయ శ్రీశైలం అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. బీవీజీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ సంపత్‌కుమార్ (రూ.3వేలు) ఆర్‌బీవీఎల్ ఎండీ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి (రూ.5వేలు) ఆర్థిక సాయం అందించారు.

మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం నేడు

కొడంగల్, న్యూస్‌టుడే: నూతనంగా ఏర్పడిన మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం ఉదయం జరుగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎస్సీల వర్గీకరణ చేయాల్సిందే

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: 2024 జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీ వర్గీకరణ చేయాలని, ఎస్సీ ఉప కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, కులధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్ల ద్వారానే ఇవ్వాలనే డిమాండ్ల సాధనకు సోమవారం హైదరాబాద్‌లో హోలియా దాసరి కులస్థుల ధర్నా ఉంటుందన్నారు.

మరమ్మతులు పూర్తి

స్పందనకు వందనం

పరిగి, న్యూస్‌టుడే: 'దీపం వెలగదు.. దారి కనపడదు' అనే శీర్షికతో ఈనెల 3న వచ్చిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. బీజాపూర్ - హైదరాబాద్ జాతీయ రహదారిపై పాడైన వీధి దీపాలను భారీ క్రేన్ సాయంతో మరమ్మతు పనులు పూర్తిచేశారు. దీంతో అంధకారం తొలగింది.



